

# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 10 జూలై 2024



# ప్రజా సేవకు బానిసలం




- ఉచిత ఇసుక విధానం చారిత్రాత్మకం
- ప్రజా జీవనాడి పోలవరం పూర్తి అవుతుంది
- జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి



**కడప, జూలై 09, ప్రభాతవార్త బ్యూరో:** ప్రభుత్వంలో పనిచేసే ప్రతి ఒక్కరు ప్రజాసేవకు బానిసలను, ప్రజలకు ఏ కష్టం వచ్చిన తక్షణం స్పందించాలని రాష్ట్ర రవాణా, ఆర్‌టీసీ,యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ ఛైర్ పర్సన్ జేష్టాది శారద అధ్యక్షతన వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల ఉమ్మడి జిల్లాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామ్‌గోపాల్‌రెడ్డి, రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్య కృష్ణారెడ్డి, డాక్టర్ డి. సుధా, పుట్టా సుధాకర్‌యాదవ్, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల జేసీలు గణేష్‌కుమార్, ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, జెడ్పీ



సీఈవో సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపిటీసీలు, ఎంపిపిలు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర రవాణా,ఆర్‌టీసీ, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాదరెడ్డి మాట్లాడుతూ



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు మేలు చేసేందుకు అధికారాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన అన్ని అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం అన్ని రకాల పెండింగ్ ఫైళ్లను క్షణ్ణంగా పరిశీలించడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వం చేపట్టి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సిఎం దృష్టికి తీసుకెళతామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని చెల్లించేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అధికారులతో పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యంతో పని చేయాలన్నారు. సర్వ సభ సమావేశంలో సభ్యులు లేవ నెత్తిన సమస్యలను జిల్లా యంత్రాంగం పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్



మాట్లాడుతూ సర్వ సభ సమావేశంలో సభ్యులు లేవనెత్తిని పరిశీలించి వచ్చే సమావేశం నాటికి అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలపై పథకాలు



అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తేనే వ్యవస్త పటిష్టంగా ఉంటుందన్నారు. జెడ్పి చైర్ పర్సన్ జేష్టాది శారధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైయస్సార్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా రూపొందించడానికి జిల్లా పరిషత్ అధికారి యంత్రాంగం ప్రజా పరిషత్ సభ్యులు ఇతర ప్రజా ప్రతినిధులు సమన్వయంతో సమష్టి కృషితో ముందుకు వెల్తామన్నారు. వివిధ శాఖాల అధికారులు ప్రగతి నివేదికను సమర్పించారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశు సమర్ద శాఖ జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ, విద్య శాఖ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, హౌసింగ్ శాఖ, డ్వామా ప్రాజెక్టు, రోడ్డు భవనాల శాఖ, పంచాయత్ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, డిఆర్డిఏ ప్రజెక్టు, సాంఘిక సంక్షేమ శాఖ, పౌరసరఫరాల శాఖ, అధికారులు ప్రగతి నివేదికను సమర్పించారు. జిల్లాలో జడ్పిటీసీలు ఎంపీటీసీలు జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సమావేశానికి వైయస్సార్, అన్నమయ్య జిల్లాల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.



# ప్రజా సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలి

మండలాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలి

అంగన్వాడి కేంద్రాల పనితీరు బాగా లేకపోతే సహించం





**రాజంపేట అర్బన్, జూలై 09, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం పనికిరాదని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పదే పదే ప్రజలు కార్యాలయానికి వచ్చే లాగాపని చేయవద్దని హితవు పలికారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి మంగళవారం రాజంపేటలో కలెక్టర్ పర్యటించారు. పర్యటనలో భాగంగా స్థానికసాతుపల్లి అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరోసారి వచ్చినప్పుడు అంగన్వాడి కేంద్రాల పనితీరు మారకపోతే సహించేది లేదని స్పష్టం చేశారు. పిల్లల హాజరు సంఖ్య చాలా ఘోరంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్, అంగన్వాడి కేంద్రంలోని సూపర్‌వైజర్‌ను, ఉద్యోగులను వివిధ విశయాలపైప్రశ్నించారు. 13మంది పిల్లలకు గారు ముగ్గురు మాత్రమే ఉండటం, మధ్యాహ్నాం 12అయినప్పటికి భోజనాన్ని తయారు చేయకపోవడం, రిజిష్టర్‌లను సవ్యంగా నిర్వహించకపోవడం వల్ల అంగన్వాడి ఉద్యోగుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడి సూపర్‌వైజర్ అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేయకపోవడంపై పట్ల ఆమెపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విశయంపై సూపర్‌వైజర్‌కు, అంగన్వాడి కేంద్రంలో పనిచేసే ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. త్వరలో ఇదే అంగన్వాడి కేంద్రానికి మళ్లీ వస్తానని, పూర్తి స్థాయిలో అంగన్వాడి కేంద్రం నిర్వహించబడాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఈ విశయంపై ప్రస్తావిస్తూ..ఆర్డీఓ, తహసీల్దార్లు, అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో రాజంపేట ఆర్డీఓ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్‌ఎస్ఎల్‌ఏ పరిధి దాటిన సమస్యలు, సిసిఆర్సి కార్డులు తదితర అంశాపై దృష్టి సారించి త్వరగా వాటిన్నిటిని పరిష్కరించాలన్నారు. వారం వారం మండల తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఆర్డీఓని ఆదేశించారు. ఈ సమావేశంలో రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు, రాజంపేట డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఏపీలో పోలీసు అధికారుల పోస్టింగ్ కోసం విస్తృత ప్రయత్నాలు తప్పలేదా?

– పోలీసు శాఖలో మొదలైన హడావిడి – కీలకమైన స్థానాల్లో పోస్టింగుల కోసం పలు దారుల్లో ప్రయత్నాలు!

**రాయచోటి, జులై 9, ప్రభాతవార్త:** ఏపీలో ప్రభుత్వం మారడంతో ఇంత కాలం లూప్‌లైన్‌లో ఉన్న అధికారులు మంచి పోస్టింగ్‌ల కోసం ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా పోలీసు శాఖలో హడావిడి కనిపిస్తోంది. డీఎస్పీ, ఎస్పై స్థాయి అధికారులు తమకు కీలకమైన స్థానాల్లో పోస్టింగుల కోసం పలు దారుల్లో ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీఐ, స్టేషన్ హౌజ్ ఆఫీసర్, ఎస్పై వంటి పోస్టింగుల కోసం అనువైన ప్రాంతాలను ఎంచుకొని ఫలానా చోట తమకు పోస్టింగ్ ఇప్పించాలని రాజకీయ నేతలను సంప్రదిస్తున్నట్లు సమాచారం. అనుకూలమైన అధికారుల్ని నియమించుకునేందుకు నేతల ప్రయత్నాలు రాజకీయ నేతలు కూడా తమ తమ నియోజకవర్గాల్లో తమ మాట వినే అధికారులే ఉండాలని అనుకుంటున్నారు. అందుకే కొంత మంది అనుకూలమైన అధికారులను ఎంపిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సిఫార్సు లేఖలతో తమ వద్దకు వచ్చే వారితో మాట్లాడుతున్నారు. నిజానికి ఇలాంటి బదిలీల విషయంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారే అవకాశం ఉంటుంది. అయితే డబ్బులు తీసుకుని పోస్టింగులు ఇప్పిస్తే తమ మాట వినరని ఎక్కువ ప్రజా ప్రతినిధులు తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికార పార్టీకి ఉంటే సరిపోదని తమ మాట వినే అధికారులు కూడా ఉండాలని ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారు. ప్రస్తుతం సీఐల స్థాయిలో పనిచేసిన వారిలో డీఎస్పీల స్థాయిలో పని చేసిన వారిలో ఎక్కువ మంది ఒకే సామాజిక వర్గానికి



చెందిన వారు ఉన్నట్లు ఆరోపణలు రానే వస్తున్నాయి. అలాంటి వారు కూడా తమకు బదిలీ చేసినా మంచి చోట పోస్టింగ్ ఇప్పించుకునేందుకు అదికార కూటమిలోనూ మూడు పార్టీల సన్నిహితులతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలుస్తోంది. అయితే పై స్థాయి ఇంకా పూర్తి స్థాయిలో అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయలేదు. కింది స్థాయిలో ఇంకా కసరత్తు ప్రారంభం కాలేదని అధికార వర్గాలంటున్నాయి. సిన్సియారిటీనే ప్రయార్టీగా బదిలీలు ఉంటాయంటున్న ప్రభుత్వం ఓ పక్క చెబుతోంది. పోలీసు సిబ్బంది బదిలీల్లో రాజకీయ జోక్యం ఉండదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. యూనిట్ ఆఫీసర్స్ సూచనల మేరకే ఈ సారి పోస్టింగులు ఉంటాయని ఒక్కో సర్కిల్, ఎస్‌హెచ్‌ఓ పోస్టులకు 3 పేర్లతో ప్రతిపాదనలు అనే కొత్త రూల్ పెటబోతున్నారని తెలుస్తోంది. లిస్టులోని మూడు పేర్లలో ఒక పేరును డీజీపీ ఆఫీసు ఖరారు చేయనుంది. ముందు ఐపీఎస్, తరువాత ఏపీపీఎస్ అదికారులు, అటు తరువాతే సీఐ, ఎస్సైల బదిలీలు జరుగుతాయని సమాచారం.

# మోటార్ల రిపేర్లతో నీటి కష్టాలు

: నిత్యం కాలిపోతున్న మోటార్లు

: 5 రోజులు గడుస్తున్నా నీటికి తప్పని కష్టాలు

: అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇక్కట్లు

**బద్వేలు, జూలై 9 ప్రభాతవార్త :** వేసవి కాలంలో నీటి కష్టాలు రావడం సర్వసాధారణమైనప్పటికీ వర్షాకాలంలో కూడా బద్వేలులో నీటి కష్టాలు నానాటికి పెరిగిపోతున్నాయి. ఏదో ఒక సాకుతో ప్రజలకు సరైన సమయానికి నీరు ఇవ్వకపోగా 5 రోజులు గడుస్తున్నా నీటితో ఇబ్బందులు పడుతున్న ప్రజలను గుర్తించకుండా సాకులతో ప్రజలకు నీటి కష్టాలు తెప్పిస్తున్నారు. రూ.110 కోట్ల ప్రాజెక్టులో నాణ్యత లేకుండా పనులు చేశారా లేక ప్రస్తుతం నాణ్యతలేని మోటార్లు వలన ఇబ్బందులు అవుతున్నాయా తెలియదు గాని ప్రతి రోజూ మోటార్లతో బద్వేలు పట్టణ వాసులకు నీటికష్టాలు తెప్పిస్తున్నారు అధికారులు. ఒక నెలలో నీటి మోటార్లు ఎన్నిసార్లు కాలిపోతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. నిన్నటి వరకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని నీళ్ల ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. నెల రోజులపాటు ఇబ్బంది పడ్డ ప్రజలు ఉపశమనం దొరికిందనుకున్న సమయంలో నీటి మోటార్లు చెడిపోయాయని తాజాగా చెబుతున్నారు. ఇలా నీటి మోటార్లు కాలిపోవడం ఇది మొదటిసారి కాదు. ఎన్నో పర్యాయాలు మోటార్లు కాలిపోతున్నప్పటికీ వాటి మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు దోచుకుంటున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఈ మరమ్మతులకు పెట్టే ఖర్చులో కొత్త మోటార్లు వచ్చే అవకాశం ఉందని అయినప్పటికీ ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న అధికారి వలన ఇదంతా జరుగుతుందని పలువురు అంటున్నారు. ఒక్కసారి మోటారు రిపేరు వస్తే మళ్లి తయారు చేస్తే ఆ మోటారు ఎన్నిరోజులు వస్తుందో అందరికీ తెలిసిందే. కానీ ఇక్కడ మాత్రం నెల రోజులలోపే మళ్లి కాలిపోతుంటాయి. ఇందులోని ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదు. ఇది దోచుకునే ప్రక్రియ లేక ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రక్రియ అనేది ప్రశ్నార్థకంగా మారింది. నిత్యం మోటార్లు ఎందుకు కాలిపోతాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒక్కసారి మరమ్మతుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నట్లు కనపడుతోంది. ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టిపెట్టకపోతే మాత్రం నీటి కష్టాలు తప్పవు. ముఖ్యంగా పాలకవర్గం పూర్తిగా చేతులెత్తేసింది. ప్రభుత్వం మారిన వెంటనే పాలకవర్గం కూడా ప్రజా సమస్యలను గాలికొదిలేసిందేనే విమర్శలు వినవస్తున్నాయి. బద్వేలుకు నీరు వచ్చేందుకు 30 కి.మీ.దూరం నుంచి మోటార్లు ఏర్పాటు చేసుకుని కోట్ల రూపాయలు ఖర్చుపెడితే ఖాళీపోతున్న మోటార్లలో జరుగుతున్న వ్యవహారశైలిపై అధికారులు దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు. బ్రహ్మంసాగర్ నుంచి ధర్మల్‌కు నీరు పోతున్నాయి. బద్వేలులోని సెంచరీ ప్లైవుడ్‌కు నిరంతరం నీరువెళ్తున్నాయి. వారికి రాని సమస్య మున్సిపాలిటీకి ఏర్పాటు చేసిన మోటార్లకు మాత్రమే ఎందుకు సమస్యలు వస్తున్నాయో అర్థం కావడం లేదు. దీని వలన పట్టణ ప్రజలు నీటికోసం అలమటిస్తున్నారు. 90వేలు ఉన్న జనాభా ఉన్న పట్టణంలో కొందరు మాత్రమే ఇంటికి మోటార్లు వేసుకున్నప్పటికీ మిగిలిన వారంతా మున్సిపాలిటీలోని నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇటు పశువులతో పాటు పలు జంతువులు కూడా నీరు లేక అలమటిస్తున్నాయి. నిత్యం నీటితో ప్రజలకు అవసరమున్నప్పటికీ నాలుగురోజులకు, ఐదురోజులకు నీరు వదిలితే ఎలా సర్దుకుపోవాలో అనే విషయం అధికారులే చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాగే చేపడితే మాత్రం నీటికోసం తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.



# 80 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు

**దువ్వూరు, జూలై 09, ప్రభాతవార్త:**



స్త్రీలు గర్భం దాల్చినప్పటి నుండి ప్రతి రోజు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక వైద్యాధికారి సురేష్ బాబు తెలిపారు. మంగళవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ కే.సురేష్ బాబు, డాక్టర్ వికసిత, డా.హేమలతల ఆధ్వర్యంలో గర్భిని స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి గర్భిణీలు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై సూచనలు చేశారు. గర్భవతులు ప్రతి నెల క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వికసిత, డాక్టర్ హేమలత, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు విజయకుమారి, రాజగోపాల్, సువర్ణ, ఏఎన్ఎంలు, యంఎల్హెచ్పీలు, ఆశా కార్యకర్తలు, గర్భవతులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంను కలిసిన బద్వేలు తెలుగుదేశం నాయకులు

**బద్వేలు, జూలై 9 ప్రభాతవార్త :**



దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ని బద్వేలు తెలుగుదేశం నాయకులు రితేష్‌రెడ్డితో పాటు బీజేపీ, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసిన నాయకులు బద్వేలు రాజకీయంపై చర్చించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బద్వేలు యువనేత రితేష్‌రెడ్డికి మామ కావడంతో నాయకులంతా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో ఆర్యవైశ్య నాయకులు, సీనియర్ న్యాయవాది పీవీఎన్. ప్రసాద్, సింగసాని విజయ్‌కుమార్ (బుజ్జి), బీజేపీ కడప పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, జనసేన నాయకులు తుడిమెళ్ల మురళిలు కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం మంత్రి నారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు.

# 30 మంది గర్భిణీలకు స్క్రీనింగ్

**ఖాజీపేట, జూలై 09, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ ఆయేషా సుల్తాన్ ఆధ్వర్యంలో ప్రధామంత్రి సురక్షిత మంత్రిత్వ అభయాన్‌లో భాగంగా 11 సచివాలయంలో ఉన్న సిబ్బంది, గర్భిణీ స్త్రీలను 30మంది స్క్రీనింగ్ చేయడం జరిగింది. డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేసు విచ్చేసి ప్రధానమంత్రి సురక్షిత్ మంత్రిత్వ అభియాన్ ప్రతి గర్భవతి మొదటి గర్భం బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. జననీ సురక్ష యోజన గురించి, జేఎస్ఎస్‌కే తెలియజేశారు. డాక్టర్ ఆయేషా సుల్తాన్ మాట్లాడుతూ 2016 నుండి పీఎంఎస్ఎంఏ ప్రారంభం చేశారని, మాన్‌కీ బాత్ జూలై 2016 మాత శిశురమణాలు రేటు నియంత్రణ కోసం గర్భిణీ స్త్రీలకు సరైన పోషన ఆహారాలు అందలి గర్భిణీ స్త్రీలందరికి సమగ్రమైన మరియు నాణ్యమైన ప్రసవంతరం సంరక్షణ అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓస్ స్వర్ణలత, మహిత, మౌళిక, హెల్త్ అసిస్టెంట్ సంతత్మ, సుజాత, ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, ఆశ నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్ బి.కృష్ణప్రియ, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గా ప్రసాద్. స్టాఫ్ నర్స్ సుప్రజ, ఫార్మసీ ఆఫీసర్ కేశవయ్య పాల్గొన్నారు.

# ఉపాధి ద్వారా పండ్ల తోటలకు ప్రోత్సాహం

**దువ్వూరు, జూలై 09, ప్రభాతవార్త:**



మహాత్మాగాంధి గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నూరు శాతం సబ్సిడితో పండ్లతోటల పెంపకం చేపట్టవచ్చు అని మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ వసంతకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20వ తేది వరకు హార్టికల్చర్‌కు ధరఖాస్తు చేసుకోవచ్చే అని, 5ఎకరాలు లేదా అంతకంటే తక్కువ భూమి కిలిగిన చిన్న, సన్నకారు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అన్నారు. మామిడి, చీని, సన్న నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు నాటుకొంటే 3సంవత్సరాల పాటు ప్రభుత్వం ద్వారా నూరు శాతం ఉచితంగా నిర్వహణ చార్జీలు చెల్లించడం జరుగుతుంది అన్నారు. రోజా మరియు మల్లె తోటలు నాటుకున్న రైతులకు రెండు సంవత్సరాల నిర్వహణ చార్జీలు చెల్లించడం జరుగుతుంది అన్నారు. మునగ తోటలు నాటుకునే రైతులకు సరఫరా చేసినట్లైతే వారికి 3నెలల పాటు మొక్కను పెంచి ఉపాధి హామీలో నాటుకునే రైతులకు సరఫరా చేసినట్లైతే వారికి 3 నెలల పాటు మొక్కలు పెంచిన చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుంది అన్నారు. కావున ఆసక్తి గల రైతులు మండల ఉపాధి ఏపీఓను లేదా గ్రామస్థాయిలో క్షేత్ర సహాయకుడు ఎఫ్ఏ సాంకేతిక సహాయకుడు టిఏని సంప్రదించాలని కోరారు. ఉపాధి హామీ జాబ్ కార్డ్, భూమి పట్టాదారు పాసు పుస్తకము, నకలు, వన్‌బి, సన్నా, చిన్నకారు రైతు పత్రం, జాబ్‌కార్డులో ఉన్న వారి ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని దువ్వూరు మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

**బద్వేలు, జూలై 9 ప్రభాతవార్త :**



మున్సిపాలిటీలోని 35 వార్డుల లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిలో హెచ్చరిక బోర్డులు వేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బసివి రమేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు జనసేన నాయకులు వినతపత్రం అందించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో వైసీపీ నాయకులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారని ఆ స్థలాలన్ని వెనక్కు తీసుకుని వాటిలో హెచ్చరిక బోర్డును వేయాలని కోరారు. ప్రజల సొమ్ము దోచుకుంటున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విన్నవించారు. కమిషనర్ స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలలో హెచ్చరిక బోర్డులు నాటుదామని సానుకూలంగా స్పందించినట్లు రమేష్ తెలిపారు. వీరిలో జనసేన నాయకులు నంద కిశోర్, గోపవరం మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సురేంద్ర, వెంకటేష్, క్రాంతికుమార్, సాయికుమార్, నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## పెన్షన్‌దారులకు క్వాంటము పునరుద్దరించాలి

**బద్వేలు అర్బన్, జూలై 9 ప్రభాతవార్త :**

పెన్షన్‌దారులకు క్వాంటము పునరుద్దరించాలని ఏపీ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం బద్వేలు శాఖ అధ్యక్షులు శీలం గంగన్న మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ప్రభుతా ్వనికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం 70 సంవత్సరాలు దాఇన వారికి 10 శాతం 75 సంవత్సరాలు దాటిన వారికి 15 శాతం క్వాంటం మంజూరు చేస్తూ సీనియర్ సిటిజన్‌కు ప్రత్యేక సదుపాయం కల్పించబడినద న్నారు. అయితే వైసీపీ హయాంలో 10 శాతాన్ని 7శాతానికి అలాగే 15 శాతాన్ని 12 శాతానికి తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో పెన్షన్ దారులు ఐదేళ్ల కాలంలో ఆర్థికంగా చాలా నష్టపోయా రన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిని తిరిగి 15శాతానికి పునరుద్దరిం చాలని కోరారు. ఈకార్యక్రమంలో సుశీలమ్మ, సత్తిబాబు, తదితరులు




## చంద్రబాబు చిత్రపటానికి జగన్‌రాజు పాలాభిషేకం

**రాజంపేట అర్బన్, జూలై 09, ప్రభాతవార్త:**



తెలుగుదేశం, ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానంతో నిర్మాణరంగం తిరిగి ఊపందుకున్నదని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్ రాజు తెలియజేశారు. మంగళవారం ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిన సంధర్భంగా తన క్యాంపు కార్యాలయంలో భవణ నిర్మాణ కార్మికులతో కలిసి చమర్తి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చమర్తి జగన్‌మోహన్ రాజు మాట్లాడుతూ వైకాపా పరిపాలనలో జగన్‌మోహన్ రాజు అడ్డగోలు విధానాల వలన, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇసుక కొనలేని స్థితికి చేరి తద్వారా అన్ని రంగాలు కుదేలయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే అధికారంలోకి వచ్చిన ఒక్క మాసంలోనే ఉచిత ఇసుకను ప్రజలకు అందించడం గర్వనీయం అన్నారు. భవణనిర్మాణ కార్మికులు మాట్లాడుతూ ఇసుక లభించక గత ఐదేళ్లలో తమంత దుర్భర జీవితాలు అనుభవించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఉచిత ఇసుక విధానంతో తిరిగి మా కుటుంబాలలో వెలుగులు నిండుకున్నాయని ఈ సంధర్భంగా చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ రోడ్డు రవాణా రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ బాష, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రమణ్యంనాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి అమ్మినేని అజయ్‌కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్ రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబుబకర్, రాజంపేట మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే కరీమ్, శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు, సీనియర్ నాయకులు జీవి సుబ్బరాజు, తెలుగుయువత పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, తెలుగుయువత పార్లమెంట్ అధికారి ప్రతినిధి జగదాభి పాండురాజు, హస్తివారిప్రతినిధి జగదాభి పాండు రాజు, ఒంటిమిట్ట శివారెడ్డి, బోడిచెర్ల శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు రంతూ, మల్లికార్జున, సాలాబాదు చౌడయ్య, లక్ష్మిరెడ్డి, మౌళాలి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భవణనిర్మాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## 12న మండల సర్వసభ్య సమావేశం

**చాపాడు, జూలై 09, ప్రభాతవార్త:**

స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవణం నందు 12వ తేదిన మండల పరిషత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశంనిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంతులయ్య తెలిపారు. ఈ సమావేశానికి మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిధులుగా హాజరౌతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు వారి శాఖల యొక్క సమగ్ర నివేదికతో హాజరుకావాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక

**పీలేరు, జూలై 09 ప్రభాతవార్తః**

స్థానిక టీటీడీ కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్ విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజినేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామమోహన్ , సాకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మ ల అధికారులచే బుధవారం ఆపరేషన్ డివిజన్ పరిధిలో ఉదయం 11.30గంటల నుంచి 1.30గంటల వరకు పీలేరు డివిజన్, సబ్‌డివిజన్, పీలేరు రూరల్, కలికిరి సబ్‌డివిజన్‌కు సంబందించి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించబడునన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది ఈఅదాలత్‌కు హాజరవుతారు, కావున విద్యుత్ వినియోగదారుల యొక్క సమస్యలు వ్రాతపూర్వక ఫిర్యాదు ద్వారా తెలియజేసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిచంద్ర కోరారు.

## ఖాజీపేటలో వరుసగా పలుచోట్ల దొంగతనాలు

**ఖాజీపేట, జూలై 09, ప్రభాతవార్త:**



సోమవారం రాత్రి ఖాజీపేట మండల పరిధిలోని సర్వర్ఖాన్ పేట ప్రధాన రహదారిలో వరుసగా ఆరు దొంగతనాలు జరగడంతో మండల ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. ఖాజీపేట టౌన్ సర్వర్ ఖాన్ పేట ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న ఫ్రైవుడ్, కూల్‌డ్రింక్, మెకానిక్, విత్తనముల, ఫైపుల దుకాణాలతో పాటు టీచర్స్ కాలనీలోని ఒక ఇంట్లో చోరికి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణాలపైభాగంలోని ఇనుప రేకులను కత్తెరతో కోసి లోపలికి దిగి నగదును దొంగలించారు. టీచర్స్ కాలనీలో ఇంటికి వేసిన తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి బీరువాను సోదా చేశారు. దాదాపు రూ.70వేల నగదు, చిన్న చిన్న సామాన్లు దొంగలించినట్లు బాధితులు తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ తిరుగుతే ఇలాంటి సంఘటనలు జరగవని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలాలను ఖాజీపేట సీఐ రామాంజులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. సిసి టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని నిందుతులను గుర్తిస్తామన్నారు.

# విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

**ముద్దనూరు, జూలై 09, ప్రభాతవార్త:**



విద్యార్థులు చిన్ననాటి నుండి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని వివేకానంద ఫౌండేషన్ ఛైర్మెన్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వివేకానందుని బోధనలు-మానవతా విలువలపై జరిగిన చైతన్య సదస్సులో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఒత్తిళ్లకు గురికాకుండా పట్టుదలతో చదవాలన్నారు. పెడదారిన పట్టకుండా సమాజంలో వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని, పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడి, స్వామి వివేకానందుని ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజబాబు మాట్లాడుతూ సమాజంలోని ఎంతోమంది అభాగ్యులు, అనాధలకు సేవ చేస్తూ విద్యార్థులను సన్మార్గంలో పయనించేందుకు ఇలాంటి అవగాహణ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. అనంతరం పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న 90మంది విద్యార్థులకు ఉచితంగా వివేకానందుడి జీవితం-సందేషం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వివేకానంద సేవాశ్రమమునకు పాఠశాలలోని ఉపాధ్యాయులు పద్మనాభ రెడ్డి 5000రూపాయలు, కుండా భాస్కర్ 5000రూపాయలు విరాళం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అన్వర్ బాష, సంస్థ ప్రతినిధులు టి.వెంకట సురేష్, కేతన శ్రీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ ఆధ్వర్యంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం

**పీలేరు, జూలై 09 ప్రభాతవార్తః**

మండలంలోని రేగళ్ల పీహెచ్‌సీ కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షత మాతత్వ అభియాన్ కార్యక్రమం డాక్టర్లు కార్తీక్‌కుమార్, సతీష్‌కుమార్, శైలజ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి(బీపీ, షుగరు, హిమోగ్లోబిన్ టెస్టులు) రక్తహీనత రాకుండా ఐరన్, క్యాల్షియం మందులు పంపిణీ చేయడం జరిగింది. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సి న ఆహారం, ప్రమాదకర గర్భిణీ లక్షణాలు, ప్రభుత్వ పథకాలు, టీకాలు, తల్లిపాలు, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్దతులు, కిల్కారి సేవలు గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శైలజ, సీహెచ్ఓ విజయలక్ష్మీ, ఉషారాణి, రమాదేవి, చిన్నప్ప, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులతో బత్యాల భేటి

**రాజంపేట, జూలై 09, ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం అమరావతి లో మంగళవారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి బత్యాల చెంగల్రాయుడు పలుశాఖల మంత్రులతో కలిశారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వ్యవసాయ, పశుసంవర్ధఖ, మార్కెటింగ్, సహకార, మత్స్యశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు గార్లని కలిసి రైల్వే కోడూరు, రాజంపేట అభివృద్ధి విశయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలు జిల్లా మెడికల్ కాలేజీకి నోచుకోలేదన్నారు. అన్నమయ్య డ్యాం వైసీపీ నాయకులు స్వలాభం కోసం తెగిపోయేలా చేసి ఎన్నో ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారని ఇప్పటికి చుట్టుప్రక్కల చాలా ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు అభివృద్ధిలో రాష్ట్రంలోనే చాలా వెనకబడి ఉన్నాయని ఈ రెండు నియోజకవర్గాల అభివృద్ధి కోసంప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అలాగే పలు సమస్యలను వినతిపత్రాల రూపంలో బత్యాల వివిధ శాఖల మంత్రులకు అందజేశారు.

## తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్

**కడప కార్పొరేషన్, జులై 9, ప్రభాతవార్త:**

తపాలా శాఖలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేసిన వారికి తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ లభిస్తుందని ఇతర ఇన్సూరెన్స్ కంపెనీల కంటే పోస్టల్ ఇన్సూరెన్స్‌లో తక్కువ ప్రీమియం ఉంటుందని తపాలా శాఖ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. ఈ మాసంలో రెండు పర్యాయాలు డ్రైవ్ నిర్వహించామని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం కడప నగరంలోని తపాలా శాఖలో ఆయన మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అతి పురాతణమైందని గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వెల్ఫేర్ కోసం ఉండేదని, ఇప్పుడు డిగ్రీ, డిప్లొమో ఇతర ప్రొఫెసనల్ కోర్సు చేసిన వారందరూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయడానికి అర్హులని తెలిపారు. కనుక పీఎల్ఐసీ పాలసీ తీసుకోవాలని కోరారు. 19 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని, కనీస పాలసీ విలువ రూ.20 వేలు, గరిష్ట పాలసీ రూ.50లక్షల వరకు ఉందని వెల్లడించారు. ప్రీమియం దేశ వ్యాప్తంగా ఏ పోస్టాఫీసులో అయినా చెల్లించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మునాఫ్ పాల్గొన్నారు.

## శాఖాహార సద్భావన యాత్ర




**పీలేరు, జూలై 09 ప్రభాతవార్తః**

కొటాల జేతవనం పిరమిడ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో పీలేరు లో శాఖాహార ర్యాలీ శ్రీబ్రహ్మర్షి పితామహ పత్రి మహారాజ్ ఆశీస్సులతో సుమారు 800 మంది పిరమిడ్ మాస్టర్లు పాల్గొని శాఖాహారం యొక్క విశిష్టతను విలువలను ప్రజలకు తెలియజేశారు. ఈర్యాలీ ముఖ్య ఉద్దేశ్యం మానవుని ఆహారం పూర్తి శాఖాహారమేనని ఆదిమానవుల కాలంలో ఆహారం పట్ల అవగాహన లేని సమయంలో అన్ని జీవులను చంపి తినడం తప్ప నాగరికత వచ్చిన ప్రపంచానికి మనం ముఖ్యంగా మన భారతదేశంలో ఆధ్యాత్మిక సంపద, సనాతన సంపద తెలిసిన ఒకే ఒక్క మాట మానవుని ఆహారం శాఖాహార మాత్రమేనని కానీ మనం విదేశీయుల ప్రలోభాలకు లొంగి జంతురుచులు మరిగి మాంసభక్షణ మొదలు పెట్టి ఆజీవులన్నీ మనకోసమే పుట్టాయని ఒక అపోహలో జీవిస్తున్న వారికి పత్రీజీ గారు మనందరం శాఖాహారులమేనని , శాఖాహారమే తినాలి అనే ప్రభోదాన్ని పిరమిడ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో వివరించారు. ఈకార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగినది, ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తదితర రాష్ట్రాల నుంచి పిరమిడ్ సెంటర్ నందు సుధాకర్ శరీరం విడచి సంవత్సరమైన సందర్భంగా మూడు రోజులు అమరోత్సవంలో భాగంగా పీలేరులో శాఖాహార ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్య కారకుడు మాస్టర్ ప్రభాకర్, పలమనేరు బాలాజీ సంగీతంలో పిప్పిళ్ల ప్రసాదరావు, గణేష్ రాయచోటి సతీష్, చింతామణి , కందుకూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి అనేక మంది మాస్టర్స్ పాల్గొన్నారు.

## నగల బ్యాగును బాధితులకు అప్పగింత



**నందలూరు, జులై 09, ప్రభాతవార్త:**

కడప-రేణిగుంట జాతీయ రహదారి కూడలిలో బస్టాండ్ నందు ఉన్న కృష్ణా బేకరీ వద్ద సోమవారం రాత్రి 11 గంటల సమయం లో సిద్ధవటం నుండి ఆకేపాడు(రాజంపేట) కు వెళ్తున ఆవుల కవిత ఆమె భర్త ఆవుల కిషోర్ రెడ్డిలు 13 తులాల(4 గాజులు, మూడు వరసల చైన్)బంగారు నగలు గల హ్యాండ్ బ్యాగ్ ను జారవిరుచు కోవడం అని నందలూరు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదును స్వీకరించిన ఎస్సై అబ్దుల్ జహీర్ సిసి కెమెరాల ద్వారా జరిగిన సంఘటనను పరిశీలించి వారు ప్రయాణించే సమయంలో హ్యాండ్ బ్యాగ్ కారులోంచి జారి పడటం గమనించారు. అనంతరం ఆ హ్యాండ్ బ్యాగ్ ను రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందని స్థానిక ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పరమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## ఆలయ సంపద స్వాహా-చెత్త కుప్పలతో శివునికి శతగోపం

**రౌల్వేకోడూరు అర్బన్, జులై 09, ప్రభాతవార్త:**

కోడూరు పట్టణంలోని శివాలయానికి చుట్టూ వచ్చే ఆదాయాలను ప్రతి నిత్యం కొంతబంది పూజరులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాహా చేస్తున్నారు. అయితే శివునికి మాత్రం చెత్త కుప్పల శతగోపం పెట్టి దూప దీప నైవేద్యాలు కుడా నోచుకోకుండా చేయడం ఈ ఆలయ కమిటీ సభ్యుల అవినీతికి అద్ద పట్టునట్లుంది. ఆలయ భూములు, చుట్టూ ఉన్న లక్ష్యలాది రూపాయల ఆదాయాన్ని ఇచ్చే కిరాణా షాపులు, అద్దె ఇల్లులు ఉన్నప్పటికీ శివునికి మాత్రం ఆలయ కమిటీ సభ్యులు అందమైన చెత్త కుప్పల శతకోపాన్ని పెట్టి శివాలయ ఆదాయం అంతా దిగమింగేస్తున్నారు. వీటి పట్ల చర్యలు తీసుకోవాల్సి న దేవాదాయశాఖ, పంచాయతీ శాఖ అధికారులు నిమ్మకు నీరుత్తినట్లు వ్యహరిస్తున్నారు. వీరితీరే శివాలయంలో ఉన్న చెత్త కుప్పలు నిదర్శనమని చెప్పవచ్చు. నిత్యం వందలాదిమంది భక్తులు శివాలయానికి పూజల కోసం కిటకిటలాడతుంటారు. ఆలయానికి వచ్చే ఆదాయలతో అక్కడికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కూడా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేయకపోవడం ఒక ఎత్తు అయితే, ఊరి బయట ఉన్న చెత్త కుప్పల దిబ్బలతో తలపించే విధంగా శివాలయ ప్రాంగణాన్ని దుర్వాసన వెదజల్లే విధంగా భక్తులకు అసౌకర్యాలు నెలకొల్పడంతో పంచాయతీ శాఖ ఏమాత్రం వ్యవహరిస్తున్న దనేది చెప్పకనే తెలుస్తుంది.



## మదనపల్లె-హైదరాబాద్‌కు కొత్తబస్సు సర్వీసు

మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :



మదనపల్లె ఆర్టీసి వన్‌డిపో నుంచి రాత్రి 8గంటలకు మదనపల్లె- హైదరబాద్-జీడిమెట్లకు కొత్త బస్సు సర్వీసు నడుపుతున్నట్లు వన్‌డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ బస్సు కొత్త టెక్నాలిజీతో సూపర్‌లెగ్జరీ బస్సు అన్నారు. బస్సులో 40ఇంచీల ఎల్‌ఈడి టివి, సీటు సీటుకు సెల్ చార్జర్, కాళ్ళు పెట్టుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఆర్టీసి బస్సు సర్వీసుపై డ్రైవర్లతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రయాణీకులు ఏపిఎస్ఆర్టీసి ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణీకులు హైదరాబాద్‌కు వెళ్ళే రిజర్వేషన్ కొరకు 47462ను, హైదరబాబాద్‌నుంచి మదనపల్లెకు బయలుదేరే సమయం రాత్రి 8గంటలకు ఉంటుందన్నారు. ఈ సర్వీసు నెంబర్ 47463గా ఉంటుందన్నారు. ప్రయాణీకులు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం ఉంటుందన్నారు.

## ఏపి అభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యం

మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :



ఏపి అభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఎస్టీయూ కార్యాలయంలో సాంబశివ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతినెలా పెన్షన్‌లు, జీతాలు ఇచ్చేందుకు అప్పులు చేయాల్సిందేనని వైసిపి ప్రభుత్వం ఏపిని అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమని రాజకీయ పార్టీలు కలసి హోదా సాధించాలని ఆయన సూచించారు. రాష్ట్ర విభజన తరువాత పదేళ్ళు ఆపరిష్కతంగా మిగిలిపోయిన ఉభయరాష్ట్రాల సమస్యలపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చలు జరపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, క్రిష్ణప్ప, వేణుగోపాల్‌రెడ్డి, మురళి, విశ్వనాత్, నాయక్, శ్రీనివాసులు, సుమిత్రమ్మ, సుదీర్‌కుమార్, వెంకటేష్,జ్యోతి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధం పెట్టుకుందనే హత్య

మదనపల్లెక్రైం, జులై 9 ప్రభాతవార్త :



అక్రమ సంబంధం పెట్టుకొందనే భార్యను భర్త హత్య చేసినట్లు మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లెలో గతనెల 27న దారుణహత్యకు గురైన మహిళ కేసును చేదించినట్లు డిఎస్‌పి తెలిపారు. మృతురాలు పలమనేరు నాగులరాళ్ళవీధికి చెందిన గణపతి భార్య భారతి(20)గా గుర్తించి సిఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి కేసును దర్యాప్తు చేపట్టి గణపతిని మంగళవారం నిమ్మనపల్లె క్రాస్‌లో అరెస్టు చేశామన్నారు. హత్య జరిగిన రోజు భారతిని ఎవరో కొడుతున్నట్లు గమనించి పొలం యజమాని రామాంజులు వెళ్ళి అడ్డుకోగా అతనిపై గణపతి కత్తితో దాడిచేసి పారిపోయాడన్నారు. భారతి పుట్టినిల్లు పెనుమూరు అన్నారు. కొవ్వూరలుఒ కూలిపనులు చేస్తుంటే భారతి అక్కడికి వెళ్ళిపోయి రవితో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న బాద భరించలేకపోయాడన్నారు. చేపలు పట్టేందుకు నిమ్మనపల్లె ప్రాజెక్టుకు తీసుకు వచ్చిన భర్త గణపతి హత్య చేసినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన సిఐ, ఎస్ఐలను డిఎస్‌పి అభినందించారు.

## ఈతమాను వడ్డెపల్లెలో పారిశుధ్ధ్య చర్యలు

కలికిరి, జులై 9, ప్రభాతవార్త:



మండలంలోని గుండ్లూరు పంచాయతీ ఈతమాను వడ్డెపల్లెలో మంగళవారం స్థానిక సర్పంచ్ సైపుల్లా కార్యదర్శి రెడ్డిప్రసాద్‌ల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో స్థానిక సర్పంచ్ సైపుల్లా పూడిపోయిన డ్రైనేజీ కాలువలను జేసీబీతో మట్టిని తొలగించి అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగును తొలగించారు. అనంతరం గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించి క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ స్థానిక గ్రామ ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మాజీ సర్పంచ్ ఆర్.భాస్కర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించండి

జమ్మలమడుగు, జులై 9, ప్రభాతవార్త:



అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని జమ్మలమడుగు ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ బాషాకు జమ్మలమడుగు సీఐటీయూ నాయకులు అధ్యక్ష కార్యదర్శులు జి. ఏసుదాసు దాసరి విజయ్‌లు వినతిపత్రం అందించారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల పట్ల మొండి వైఖరి చూపుతున్నారని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక హక్కులను కాలరాయాలని ప్రయత్నం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి నిరసనగా సీఐటీయూ ఆల్ ఇండియా పిలుపులో భాగంగా జులై 10న నిరసనతలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

పులివెందుల రూరల్, జులై 9, ప్రభాతవార్త ః




ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని పులివెందుల మున్సిపల్ కమీషనరు రమణారెడ్డి సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్నపల్లె రోడ్డులోని జయమ్మ కాంప్లెక్స్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, తినే తిండి, తదితర వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే హోటళ్ల నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

వేంపల్లె, జూలై 9, ప్రభాతవార్త ః



బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే చైతన్య మహిళా మండలి ధ్యేయమని ప్రెసిడెంట్ రామాంజనమ్మ అన్నారు. వేంపల్లెలోని భవిత దివ్యాంగుల విద్యా వనరుల కేంద్రంలో చైతన్య మహిళా మండలి వారిచే రూ.2లక్షలు విలువ గల 20 వీల్‌ఛైర్లను వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఈ కోఆర్డినేటరు కేశవరెడ్డి, ఎంఈవో జాఫర్‌సాధిక్, స్టాలిన్ ఐజాక్, చిల్డ్రన్ హోడ్ ప్రెసిడెంట్ మేరీ ఎస్తేరు, ఫాస్టర్ స్టీఫెన్‌పాల్, నాగన్న, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా మండలి ప్రెసిడెంట్ రామాంజనమ్మ మాట్లాడుతూ మహిళలు, బాలబాలికల అభ్యున్నతి కోసం తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. గ్రామీణ మహిళలకు, వితంతువులకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు కూడా ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. సంస్థ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గజ్జలవాండ్లపల్లెలో మంచినీటి సమస్య పరిష్కారం

కలికిరి, జులై 9, ప్రభాతవార్త:



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ గజ్జలవాండ్లపల్లెలో మంగళవారం స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, కార్యదర్శి గాయత్రిలు మంచినీటి సమస్య పరిష్కరించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి బోరు అదే విధంగా స్టార్టర్ మరమ్మతులకు గురి కావడంతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తింది. దీంతో స్థానికులు సర్పంచ్‌కి సమాచారం అందించారు. వెంటనే స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ మండల స్థాయి అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సహకారంతో రక్షిత మంచినీటి బోరుకు స్టార్టర్ మరమ్మతులు చేయించి మంచినీటి సమస్య పరిష్కరించారు. సమస్య వచ్చిన వెంటనే స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీలోని పాత హరిజనవాడలోను బోడిరెడ్డిగారిపల్లెలోనూ చెరువుముందర కురవపల్లెలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, కార్యదర్శి గాయత్రి పారిశుద్ధ్య చర్యలు చేపట్టి మురుగునీటి కాలువలు శుభ్రం చేయించి మంచినీటి ట్యాంక్‌లు క్లోరినేషన్ చేయించడం జరిగింది. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు రక్షిత మంచినీటి ట్యాంకులకు మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.

## బస్‌స్టేషన్ అసంపూర్తి పనులను పూర్తి చేయించండి



వేంపల్లె, జూలై 9, ప్రభాతవార్త ః

వేంపల్లెలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ అసంపూర్తి పనులను పూర్తి చేయించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రిని మండిపల్లె ప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. కడపలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఉన్న మంత్రిని మంగళవారం ఎమ్మెల్సీ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో రూ.2.32కోట్లతో బస్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. కాంట్రాక్టరు మొత్తం పనులు పూర్తి చేశారని, ఇందులో రూ.32లక్షలు మిగిలిపోయిందన్నారు. వేంపల్లెలో రోడ్ల విస్తరణకు సంబంధించి బస్‌స్టేషన్ ఇన్, ఔట్ ఉన్న చోట్ల కాల్వ పనులు చేపట్టకుండా గుత్తేదారు వదిలిపెట్టి వెళ్లారన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండుకు సంబంధించి మిగిలి ఉన్న రూ.32లక్షలతో బస్టాండు ఇన్, ఔట్ ఉన్న చోట్ల అప్రోచ్ పనులు పూర్తి చేయించి త్వరితగతిన మీరే బస్‌స్టేషన్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి ప్రసాద్‌రెడ్డి స్పందించి రీజనల్ మేనేజరుకు ఫోన్ చేసి వేంపల్లెలోని బస్‌స్టేషన్ వద్ద ఇన్, ఔట్ ఉన్న ప్రాంతంలో వెంటనే అప్రోచ్ పనులు పూర్తి చేయించి బస్‌స్టేషన్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

## పండ్ల తోటల పెంపకంపై అవగాహన పెంచండి



తంబళ్లపల్లె, జులై 9, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించేలా ఉపాధి హామీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీవో కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో జరిపిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలతో పాటు వ్యాపార పంటలైన పూల తోటలు, మునగ, సిరికల్చర్ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులకు పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుగ్రాసం పెంచుకోవడం, షెడ్ల నిర్మానం, పొలం గట్లపై మొక్కల పెంపకం చేపట్టుకోవచ్చున్నారు. పురాతన బావులు పూడిక తీత, ఓపెన్ వెల్స్ నిర్మాణం, రింగ్ బండ్, ఒంద్రు మట్టి తరలించుట, మట్టి గెనాలు నిర్మాణాలతో పాటు డ్రిప్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటి నుంచే ఉపాధి హామీ ఏపీవో అంజనప్ప, ఇంజినీరు రామన్న, మరియు టెక్నికల్ అసిస్టెంట్లు సహకారంతో క్షేత్ర సహాయకులు కార్యరంగంలోకి దిగి పై కనబరిచిన ప్రతి కార్యక్రమాన్ని రైతులకు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వారు ముందుకు వచ్చేలా ఉత్తేజపరచాలన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



తంబళ్లపల్లె, జులై 9, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో రెవెన్యూ సమస్యలతో పాటు నిరుపేదల సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని తహసీల్దారు బ్రహ్మయ్య సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. పనుల కోసం కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఉచిత ఇసుక విధి విధానాలు ఇంకా రాలేదని త్వరలో ఉచిత ఇసుక పంపిణీపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులు సైతం సమస్యల పరిష్కారంలో చొరవ చూపేలా సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట వీఆర్వోల సంఘం కార్యదర్శి రమణ, మంజునాథ్, భద్రయ్య, శ్రీరాములు, విశ్వం, భరదర నాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## మంత్రులతో వరుస భేటీలు

పులివెందుల టౌన్, జూలై 9, ప్రభాతవార్త ః



పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) మంత్రులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్థక, సహకార శాక మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను బీటెక్ రవి కలిశారు. పులివెందుల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వారికి వివరించారు. త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

వేంపల్లె, జూలై 9, ప్రభాతవార్త ః

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ హాస్టల్ గదుల్లోని విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ట్రిపుల్‌ఐటీ ఏవో పెనుగొండ రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం సెక్యూరిటీ, కేర్‌టేకర్లతో కలిసి ఆయన హాస్టల్ గదులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో గంజాయి కలకలం రేగడంతో యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇందులో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల నుండి ఎలక్ట్రికల్ వస్తువులైన హీటర్లు, రైస్ కుక్కర్లు, ఐరన్‌బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. ఇక నుండి ప్రతి భవన వద్ద సెక్యూరిటీ గార్డులు ప్రతిరోజు తనిఖీలు నిర్వహించేలా కేర్ టేకర్లను ఆదేశించారు.



## నిర్దేశించిన స్టాక్ పాయింట్ల నుండే ఇసుక తోలుకోవాలి



వేంపల్లె, జూలై 9, ప్రభాతవార్త ః

నిర్దేశించిన స్టాక్ పాయింట్ల నుండే వినియోగదారులు ఇసుక తోలుకోవాలని వేంపల్లె తహసీల్దారు వెంకటేష్, సీఐ చాంద్‌బాషాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఉచిత ఇసుక విధానాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాక్టరు యజమానులు, రైతులకు నూతన మార్గదర్శకాలకు వివరించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిర్వహణ ఛార్జిలు మాత్రమే తీసుకుని వినియోగదారులకు ఇసుక సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇసుక కావల్సిన వారు స్టాక్ పాయింట్ల వద్ద ట్రాన్సిట్ ఫారంలో వివరాలతో తమ ఆధార్ నంబరు నమోదు చేసి బుక్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 11 స్టాక్ పాయింట్లు ఉండగా.. వేంపల్లెకు సమీపంలోని వీరపునాయునిపల్లె, పులివెందులలో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన స్టాక్ పాయింట్ల నుండే ఇసుకను తోలుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. అలాగే ఎద్దుల బండ్లకు మినహాయింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి సోమశేఖర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతినెలా పౌష్టికాహారం అందించడం సంతోషించదగ్గ విషయం

కొండాపురం, జూలై 9, ప్రభాతవార్త ః

తల్లి, బిడ్డల క్షేమం కోసం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటి ఆధ్వర్యంలో ప్రతినెలా 9వ తేదీన పౌష్టికాహారం అందించడం సంతోషించదగ్గ విషయమని ప్రభుత్వ వైద్యులు సుజాత అన్నారు. కొండాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటి ఆధ్వర్యంలో గర్భవతులకు అన్నదానం నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన తిమ్మగారి క్రిష్ణారెడ్డి ఆర్థికసాయంతో అన్నదానం నిర్వహించినట్లు సొసైటి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి మండల నాయకులు హనుమంతరెడ్డి, డాక్టర్ మహదేవరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, గర్భవతులు పాల్గొన్నారు.



## లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాధవిరెడ్డి

కడప వైద్యవిభాగం, జులై 9, ప్రభాతవార్త:

జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు ఏపీ విద్యా మరియు ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌ను మంగళవారం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాక అనేక పరిశ్రమలు రాష్ట్రానికి తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. కడప కేంద్రంగా పరిశ్రమను ఏర్పాటు చేయాలని మాధవిరెడ్డి ఈ సందర్భంగా కోరారు. యువతకు ఉపాధి కల్పించేలా కడపకు పరిశ్రమలు రావాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు ఉపాధ్యక్షుడి నియామకం

కడప వైద్యవిభాగం, జులై 9, ప్రభాతవార్త:

తెదేపా అనుబంధ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు ఉపాధ్యక్షుడిగా ప్రొద్దుటూరు నియోజకవర్గం వైఎంఆర్ కాలనీకి చెందిన బిజివేముల చేతన్‌కుమార్‌రెడ్డిని నియమించడం జరిగింది. కడపలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు.

## నేడే మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

మైదుకూరు జులై 9, ప్రభాతవార్త :

నేటి ఉదయం 11 గంటలకు వనిపెంట రోడ్డు తెలుగు గంగ కాలనీలో గల నూతన పురపాలక భవనంలో పురపాలక కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమీషనర్ జబ్బార్ మియా తెలియజేశారు. ఈ సమావేశానికి శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతున్నట్లు తెలియజేశారు. కావునా 24వార్డుల కౌన్సిల్ సభ్యులు తప్పక హాజరు కావలసినదిగా కోరారు.

## రాయచోటి-గాలివీడు బస్సు సర్వీసులను పెంచండి



గాలివీడు, జులై 1(ప్రభాతవార్త):

ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు చేరుకునేలా రాయచోటి-గాలివీడు బస్సు సర్వీసులను పెంచాలని కోరుతూ ఆపస్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు దేరంగుల రామేశ్వర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. రాయచోటి నుంచి గాలివీడుకు వస్తున్న ఉపాధ్యాయులు సకాలంలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి విద్యావ్యవస్థకు గొడ్డలి పెట్టు లాంటి జీఓ నెం.117ను రద్దు చేసి, ప్రాథమిక విద్యను కాపాడాలని కోరడం జరిగింది. మంత్రి స్పందిస్తూ రాయచోటి-గాలివీడు బస్సు సర్వీసులను పెంచుతామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిన్నకోట్ల రమణ, వెంకటరమణ పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప లీగల్, జులై 9, ప్రభాతవార్త:

కడప నగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా న్యాయ సంధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జీ ప్రత్యూషలు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి - ప్రమాదాలను నివారించండి, హెల్మెట్‌ను నిర్లక్ష్యం చేయకండి మీ కోసం మరియు మీ కోసం నిరీక్షిస్తున్న వారి కోసం ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, వాహనదారుడు తమ ప్రాణాలనే కాకుండా కుటుంబ సంక్షేమాన్ని గుర్తించుకోవాలి, వాహనదారుడు రోడ్డు భద్రతనియమాలను పాటించాలి, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించడం ద్విచక్ర వాహనం అతి వేగంగా నడపడం హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతాయని అతివేగం, రోడ్డు నియమ నిబంధనలు, హెల్మెట్ ధరించి తమ ప్రమాదాల బారి నుంచి కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, పారా లీగల్ వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ అడ్మిషన్లపై చర్యలేవీ?

కడప వైద్యవిభాగం, జులై 9, ప్రభాతవార్త:

అక్రమంగా అడ్మిషన్లు చేస్తు నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) జిల్లా అధ్యక్షులు రమావత్, జగన్ నాయక్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు అధిక మొత్తంలో అడ్మిషన్ ఫీజులు వసూలు చేయడం, అలాగే యాజమాన్యం తమ పుస్తకాలు పాఠశాలలోనే కొనాలని పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనిఫాం, బుక్కు, ఇతర మెటీరియల్ అమ్ముతూ అక్రమంగా వసూలు చేస్తున్నారని అలాగే ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేకపోతే దశల వారీ పోరాటాలు చేస్తామని తెలిపారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన నాదేండ్ల అరుణ్‌తేజ

మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :



రాష్ట్ర ఐటి, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాదేండ్ల అరుణ్‌తేజ్ కలిశారు. మంగళవారం మంత్రి కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హాయాంలో తమపై పెట్టిన అక్రమ కేసుల గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసమస్యలపై మంత్రితో ప్రస్తావించారు. అనంతరం మంత్రి మాట్లాడతూ వైసిపి ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా ప్రజాసమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు.

## ఉచిత మెగా వైద్యశిబిరం

రామసముద్రం, జులై 9 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని లక్ష్మీజనార్థన్‌స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యనిపుణులు పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. గుండెకు, కంటికి, నరాల వ్యాధులకు సంబంధించిన డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తీసుకువస్తే ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉచిత వైద్యశిబిరానికి మల్లికార్జునసాయుడు, వైద్యసిబ్బందికి సౌకర్యాలు కల్పించారు.

## వెలుగు ప్రత్యేక పాఠశాలలో అన్నదానం

మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బి.కొత్తకట మండలం బండారువారిపల్లె గ్రామ పంచాయితీ చిటిమిరెడ్డిగారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి, రాధమ్మల మనవుడు తన్విష్ సాయిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్దుల మద్య కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. వెలుగు స్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి సిన్నహితుడైన సుబ్బారెడ్డి మనవుడు పుట్టినరోజు వేడుకలు వెలుగుస్కూల్‌లో జరగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దీపిక, శివప్రసాద్‌రెడ్డి, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారిలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గంగజాతర

రామసముద్రం, జులై 9 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని గాజులనగర్‌లో కొలువై ఉన్న కనకదుర్గమ్మ గంగజాతర మంగళవారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ జాతరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు గ్రామస్థులు భారీగా ఏర్పాటు చేశారు. ఉదయం అర్చకులు అనీల్, శివ, రాజేష్‌లు కలిశారాదన, హోమాలు చేశారు. రెండు రోజులు అనంతరం అమ్మవారిని ఊరేగించడం జరుగుతుందని తెలిపారు.

## టిడిపి అధికారం చేపట్టిన నెలకే
# ఉచిత ఇసుక పాలసీ



**ప్రొద్దుటూరు, జూలై 09, ప్రభాతవార్త:**
తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన నెలకి ఎన్నికల హామీని అమలు చేస్తూ జీవో నెంబర్ 43 ద్వారా ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి ప్రజలకు మరియు భవననిర్మాణ కార్మికులకు ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తెచ్చారని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య అన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక పాలసీ తీసుకొని వచ్చారని, దీని ద్వారా కేవలం రవాణా, సీనరీ చార్జ్, జీఎస్టీ చెల్లించడం వనల ఇసుక లబ్దిదారులు పొందవచ్చని వివరించారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీని వేశారని ఆ కమిటి ఇసుక విధానాన్ని పర్యవేక్షిస్తుందన్నారు. ఉచిత ఇసుక పాలసీ వలన పేదల సొంతింటి కళ నెరవేరనుందని, భవననిర్మాణ రంగం ఊపందుకోనున్నదని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ జీఓ 43ను విడుదల చేయడం అభినందనీయం అని, ఈ జీఓ రావడంతో ఇసుక పాలసీపై ఉన్న పూర్వ జీవోలన్ని రద్దయ్యయని తెలిపారు. గత ప్రభుత్వం ఇసుకలో 50వేల కోట్లు దోపిడి చేసిందని, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఇసుకలో భారీ కుంభకోణం చేశారని ఆరోపించారు. ప్రొద్దుటూరులో జగనన్నా కాలనీ నిర్మాణాల పేరుతో కోట్ల రూపాయలు ఇసుకను వైకాపా నాయకులతో కలిసి అధికారులు దోచుకున్నారని విమర్శించారు. త్వరలో అవినీతి చేసిన అధికారుల మీద చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘంటసాల వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ సర్వసభ్య సమావేశం



**ఖాజీపేట, జూలై 09, ప్రభాతవార్త:**
సాధారణంగా సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యేగా సుధాకర్ యాదవ్‌కు మొదటి సమావేశం. ఈ సమావేశం మండల ఎంపీపీ అబుబకర్ సిద్దిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో గత కొన్ని నెలలుగా జరిగిన మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆరా తీశారు. ముఖ్యంగా ఈ సమావేశంలో రెవెన్యూ సమస్యలు తీర్చాలని ప్రజా ప్రతినిధులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యల మీద ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో చాలా చోట్ల విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా మండలంలో విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని ఇంచార్జ్ ఏఈ గోవర్ధన్ రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. గత ప్రభుత్వం నుండి పాటిమీదపల్లెలో డ్రైనేజి సమస్య ఉందని డ్రైనేజి కాలువ కోసం గతంలో రావులపల్లె సచివాలయం వద్ద ధర్నా కూడ చేశామని రావులపల్లె ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పాటిమీదపల్లెలో డ్రైనేజి సమస్యను తీర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రాజకీయాలకు సంబంధం లేకుండా అభివృద్ధికి సహకరించాలని ప్రజా ప్రతినిధులను కోరారు. గతంలో ప్రభుత్వంలో ఏం జరిగిందో నాకు తెలియదు టిడిపి ప్రభుత్వంలో అవినీతి జరిగితే ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ స్థాయి అధికారులు, మండల ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య పరీక్షలతో తల్లి బిడ్డ క్షేమం



**పీలేరు, జూలై 09 ప్రభాతవార్త:**
సురక్షిత మాతత్వం కోసం ప్రతి గర్భిణీ స్త్రీ నిర్దేశించిన రోజుల్లో ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి చేయించుకోవడమే కాకుండా ఆరోగ్య మెలుకువలు విధిగా పాటించాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ గర్భిణీ స్త్రీలకు హితవు పలికారు. పీహెచ్‌సీ తలపులలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణీ స్త్రీలకు చంద్రశేఖర్ పరీక్షలు నిర్వహించారు. తక్కువ బరువుతో పుట్టే శిశువులు భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు బాధించే ప్రమాదం లేకపోలేదన్నారు. ఆరోగ్యకర సంతతికోసం నేడుప్రాథమిక ఆరోగ్య సేవల్లో భాగంగా ప్రభుత్వం అందించే అన్ని రకాల ఆరోగ్య పథకాలు మెరుగైన సేవలను ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన సంతతిని సమాజానికి ఇవ్వాలన్నారు. అందుకు ప్రతి నెల జరిగే పీఎంయస్ఎంఏ కార్యక్రమంలో ప్రతి గర్భిణీ ఆరోగ్యపరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని గర్భిణీస్త్రీలకు అధిక రక్తపోటు,మధుమేహం, హిమోగ్లోబిన్ శాతం నిర్ధారణ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఐరన్ పోలిక్ యాసిడ్, అల్బెండోజల్ 400 ఎంజీ మందులు అదనపు అవసరమగు మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యపరీక్షలకు హాజరైన 32 మంది గర్భిణీ స్త్రీలకు స్థానికంగా విధులు నిర్వహిస్తున్న నాగవేణి సహకారంతో పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుసుమ, నాగవేణి, షామున్నీసా, కుముద, లావణ్య, ఆశ కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## పొలతల శ్రీ మల్లేశ్వర సామి సన్నిధిలో
## రజకుల ఐక్యవేదిక నాయకులు

**కడప కార్పొరేషన్, జులై 9, ప్రభాతవార్త:**



శ్రీపొలతల మల్లేశ్వర స్వామి రజకుల ఐక్యవేదిక కడప జిల్లా అధ్యక్షులు తిప్పిరెడ్డిపల్లె నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ఓబులగారి కేశవయ్య, ఉపాధ్యక్షులు జి.పుల్లయ్య గంగులయ్య లాండ్రి సుబ్బరాయుడు, పెద్ద రోషన్నలు దర్శించుకున్నారు. అనంతరం శ్రీశ్రీశ్రీ బండెన్న స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోటూరు వెంకటేష్, ఐక్యవేదిక నాయకులు పశువుల సుబ్బరాయుడు, గంగాధర్, మాదయ్య, శివ నాగభూషణం, మస్తాన్, గంగులయ్య, చిన్న రోశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, గంగులయ్య, శివయ్య, సుబ్బరాయుడు, రమణ పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక పాలసీ విధానం రాష్ట్ర ప్రగతికి బాట

**పీలేరు, జూలై 09 ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కలికిరిలో పరిపాలన అంటే ప్రజలతో వ్యాపారం చేయడం కాదు, ప్రజలకు సౌకర్యాలు కల్పించడమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం, భవన నిర్మాణ కార్మికులు, సామాన్యులకు భారీ ఊరట లభించిందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో ఫ్రీ శాండిల్ జీఓనెంబరు 43 ను విడుదల చేసి అమల్లోకి తీసుకురావడం లాభాపేక్ష లేకుండా అభివద్ధికి బాటలు వేయడం అభినందనీయమన్నారు. గత జగన్‌రెడ్డి హయాంలో ఇసుక కుంభకోణంలో 50వేల కోట్లుకు పైగా కొల్లగొట్టారని వైసీపీ నాయకులే ఇసుకాసుర అవతారం ఎత్తారని మండిపడ్డారు. పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి ఐదు లక్షలు ఖర్చు అయితే అందులో ఇసుక కొనడానికి రూ.3లక్షలు ఖర్చు పెట్టే పరిస్థితి ఉందేదని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి బినామీ సంస్థ జేపీ వెంచర్సు చెల్లించాల్సిన 8వందల కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని దారాదత్తం చేశారన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను నిరోదిస్తూ రాష్ట్ర ప్రజల ప్రగతి ధ్యేయంగా పాలసీ రూపొందించడం నిరంతరం విజిలెన్సు పర్యవేక్షణలో ఉంటుందన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టు ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బ తినకుండా ఉచిత ఇసుకను అందిస్తూ జిల్లా స్థాయిలో శాండిల్ కమిటీలు ఏర్పాటుచేసి కలెక్టర్, సంయుక్త కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలు



అభ్యున్నతికి రాష్ట్ర ప్రగతికి బాటలు వేసి నాణ్యమైన ఇసుక ప్రజలకు భవన నిర్మాణ కార్మికులకు అందించాలన్నదే తెదేపా లక్ష్యమన్నారు. కూటమి పార్టీ మేనిఫెస్టో లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతామన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
## సత్యకుమార్‌తో ఎమ్మెల్యే వరద భేటి



**ప్రొద్దుటూరు, జూలై 09, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నందు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రొద్దుటూరు వాసి సత్యకుమార్‌తో భేటి అయ్యారు. ఈ సంధర్భంగా ప్రొద్దుటూరులోని జిల్లా ఆసుపత్రి నందు వైద్యులు, నర్సుల కొరత మరియు కార్పొరేట్ ఆసుపత్రికి అనుగుణంగా జిల్లా ఆసుపత్రి అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ప్రధానంగా ఎన్నికల హామీలో భాగంగా ప్రొద్దుటూరుకు మెడికల్ కళాశాల తీసుకొచ్చి ఆర్మిలో నిలబెట్టుకోవాల్సిన అవసరం అవసరం ఉందన్నారు. అందుకు సంబంధించిన ఒక ప్రణాళిక రూపొందించవలసినదిగా ఎమ్మెల్యే వరద కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి సత్యకుమార్ ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఉచిత ఇసుక పథకం పేదలకు వరం

**పెండ్లిమర్రి, జులై 9, ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం పేద ప్రజలకు వరమని కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. మంగళవారం పగడాలపల్లె సమీపంలో ఇసుక డంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల సొంతింటి కళను సాకారం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత ఇసుక పథకం అమలు చేయడం జరిగిందన్నారు. మండలంలోని పగడాలపల్లె సమీపంలో ప్రజలకు ఉచిత ఇసుకను సరఫరా చేసేందుకు పాయింట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుకను ఖరీదైన దిగా చేసి అక్రమంగా ఇసూలు చేయడం జరిగిందని కానీ తెదేపా ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వర్లు, యామిని, డీటీ అంజనా గౌరీ, పుత్తా లక్ష్మిరెడ్డి, సర్పంచ్ గంగిరెడ్డి, కిశోర్‌రెడ్డి, అన్నమయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూములు గుర్తించండి



**సంబేపల్లె, జులై 9, ప్రభాతవార్త:**
రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని జాతీయ రహదారి ఆనుకొని ఉన్న కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు గుర్తించాలని కలెక్టరును ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ మంగళవారం ఆర్డీవో రంగస్వామిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో రంగస్వామి రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించి నివేదిక అందజేయాలని సూచించారు. ఒక్కో గ్రామానికి ఇద్దరు వీఆర్వోలను ఇద్దరు విలేజ్ సర్వేయర్లను కేటాయించినట్లు తెలిపారు. ప్రతి రోజు సర్వే చేసి గుర్తించిన ప్రభుత్వ భూముల వివరాలు తహసీల్దారుకు అందజేయాలన్నారు. రోజు వారి నివేదికలు తమకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు రవి, ఆర్ఐ ప్రవంతి, సర్వేయర్ రామాంజులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో బ్లీచింగ్ పిచికారి



**చిట్వేలి, జులై 9, ప్రభాతవార్త:**
వాతావరణ ప్రతికూల పరిస్థితులతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చిట్వేలి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు గ్రామ ఉప సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమ, మంగళవారం పారిశుద్ధ్య కార్మికులతో పెద్దఎత్తున గ్రామ మంతా బ్లీచింగ్ పౌడర్‌ను చెల్లించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సీజనల్‌లో కాచిన నీటిని తాగడం వల్ల పలు సీజనల్ వ్యాధులను అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఆరోగ్య ఇబ్బందులు కలిగిన వెంటనే ఎన్ఎంలను, ఆశా కార్యకర్తలను సంప్రదించాలన్నారు. గ్రామ ప్రజలు చెత్తను బయట ప్రాంతాల్లో పడేయక పారిశుద్ధ్య కార్మికులకు అందించి గ్రామ స్వచ్ఛతలో సహకరించాలని ఉమామహేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సిబ్బంది నరసింహా, వెంకటేష్ పాల్గొన్నారు.

## నూతన వసతి గృహ భవనం పరిశీలన

**ప్రొద్దుటూరు క్రైం, జులై 9, ప్రభాతవార్త:**
పట్టణంలోని స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని పున: ప్రారంభించాలని సోమవారం మండల తహసీల్దారుకు ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ గంజికుంట నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం మున్సిపల్ మైదానం ఆవరణలో ఉన్న నైట్ షెల్టర్ నూతన వసతి గృహ భవనాన్ని బీసీ వెల్ఫేర్ డివిజనల్ అధికారి కృష్ణయ్య వసతి గృహ వవార్డెన్‌తో సంప్రదించి పరిశీలించడం జరిగింది. స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి త్వరలోనే పున: ప్రారంభిస్తామని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగు జాగ్రత్తలు చేపడతామని హామీ ఇచ్చారు.

## వైఎస్ఆర్‌కు ఘన నివాళి
## అర్పించిన కువైట్ కమిటీ సభ్యులు



**కడప కార్పొరేషన్, జులై 9, ప్రభాతవార్త:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో హవెల్లిలోని ఆర్ఆర్ హోటల్‌లో ఘనంగా మహానేత దివంగత ముఖ్యమంత్రి జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ అపర భగీరథుడు, సంక్షేమ సారథి, ఆరోగ్యశ్రీ ప్రధాత, బడుగు, బలహీన వర్గాల సంక్షేమ సారధి అయిన మహా నాయకుడు ప్రతి తెలుగు వారి గుండెల్లో శాశ్వతంగా ఉంటారన్నారు. వారు లేని లోటు వారి తనయుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే తీర్చగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ అడ్వైజర్ ఎంవీ నరసారెడ్డి, నాయని మహేశ్వరరెడ్డి, కోకన్వీనర్ రమణ యాదవ్, గల్ఫ్ ప్రతినిధి నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ ముఖ్య నాయకులు పులపుత్తూర్ సురేష్‌రెడ్డి, వీపీ రామచంద్రారెడ్డి, గజ్జల నరసారెడ్డి, పాటూరు వాసుదేవరెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, అరవ సుబ్బారెడ్డి, చంద్ర, హరిప్రసాద్, బసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిర్వాసితులను ఆదుకోవాలి

**రాజంపేట అర్బన్, జూలై 09, ప్రభాతవార్త:**
రాజంపేట మండలం బారిన గడ్డపై నిర్మించిన అన్నమయ్య ప్రాజెక్ట్ ఎర్త్ డ్యాం తెగిపోవడం వల్ల నిర్వాసితులైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్ విజ్ఞప్తి చేశారు. మంత్రి ఛాంబర్‌లో మంగళవారం కలిసి వారు వినతిపత్రం ఇచ్చారు. వైసీపి పార్టీకి చెందిన ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య ప్రాజెక్టుగత 19వ తేది నవంబర్ 2021వ తేదిన కొట్టుకుపోయిందని తెలిపారు. డ్యాము కొట్టుకుపోయిన సమయంలో ప్రతిపక్ష నేతగా నారా చంద్రబాబు నాయుడు పర్యటించి బాధితుల కష్టాలు నేరుగా విని..చనిపోయిన 40మందికి అధికారంలోకి వచ్చిన వెంటనే పరిహారం కింద సుమారు రూ.20లక్షల రూపాయలు చెల్లిస్తానని బాధిత కుటుంబాలకు హామి ఇచ్చిన విషయం గుర్తు చేశారు. బాధిత కుటుంబాలకు ఇల్లు నిర్మాణం పూర్తి చేసి రక్షణ కల్పించాలని కోరారు. ఇసుక మేట వేసి వ్యవసాయ యోగ్యంగా తయారు చేసి ఇవ్వాలని కోరారు. డ్యామ్ కొట్టుకుపోవడానికి గత కారణాల మీద ప్రభుత్వం కమిటి వేసి, వాస్తవాలు బయటికి తీసి కారకులపైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి వెంట వేణుగోపాల్ రెడ్డి, దుగ్గినేని చంద్రబాబు, కృష్ణ, రాథోడ్ పాల్గొన్నారు.



## పీలేరు వారపు సంతలో
# పోలీసు పహారా..!

**పీలేరు, జూలై 09 ప్రభాతవార్త:**
స్థానిక వారపుసంతలో పోలీసు పహారా ముమ్మరంగా ఉంది, వారపు సంతలో జేబు దొంగలు సెల్‌ఫోన్ దొంగలు తీవ్రతను దష్టిలో ఉంచుకుని స్థానిక సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగే వారపు సంతను పోలీసు పహారాతో రక్షణ కల్పిస్తున్నారు. దీంతో వారపుసంతలో ప్రజలు, వ్యాపారస్తులు స్థానిక పోలీసులు హెడ్‌కానిస్టేబుల్స్ మణి, ప్రసాద్, రవి, మహిళా పోలీసు కానిస్టేబుల్ లీల పహారా కాస్తుండటంతో ఆనందంగా తమ వ్యాపారాలు జరుపుకుంటున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే విద్యుత్ స్తంభాలు ఉన్నా కూడా విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటిలో వ్యాపారాలు సాగించడం ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వ్యాపారస్తులు ప్రజలు కోరుతున్నారు.

## క్విజ్ పోటీలో ప్రతిభ కనబరిచిన
## శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు




**రాయచోటి, జులై 9, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నేషనల్ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ సైన్స్ డే సందర్భంగా అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీలో సదరన్ రీజియన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరుసగా చందన రెడ్డి, అబ్దుల్లా, రెడ్డప్పరెడ్డిలు కైవసం చేసుకున్నారు. అలాగే క న్సోలేషన్ విభాగంలో ధన కిశోర్, బాబ్‌జాన్‌లు నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఏడీఎం సంస్థకు చెందిన డీ గ్రేడ్ సైంటిఫిక్ ఆఫీసర్ వినోద్‌కుమార్ మౌర్య, సీ గ్రేడ్ సైంటిఫిక్ ఆఫీసర్ వివేక్‌కుమార్ యాదవ్, కళాశాల వివిధ విభాగాధిపతులు మరియు అధ్యాపకులు అభినందించి జ్ఞాపికలు మరియు ప్రశంసా పత్రాలను బహుకరించారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే



**మదనపల్లె, జులై 9 ప్రభాతవార్త :**
విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఉర్దూస్కూల్ నందు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయినుంచి క్రమశిక్షణతో కూడిన నైపుణ్యతను కలిగిన విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. సమాజంలో రాణించాలంటే విద్యే ముఖ్య ఆయుధం అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సాంకేతిక పరమైన విద్యను బోధించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం అందజేస్తున్న విద్యాసామాగ్రిని ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యమైన బోజనాన్ని విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం ఒడ్డించాలన్నారు. భోజనం తయారీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక పట్ల బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, ప్రధానోపాధ్యాయులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాప్రభుత్వం...పెత్తందారి ప్రభుత్వం కాదు




**రామసముద్రం, జులై 9 ప్రభాతవార్త :**
ఈప్రభుత్వం ప్రజా ప్రభుత్వం, పెత్తందారి ప్రభుత్వం కాదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులు, ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెత్తందారీ విధానం అమలు జరిగిందని ఈ ప్రభుత్వంలో ప్రజాపాలన జరుగుతుందని అధికారులు ప్రజాసమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మండలంలోని వ్యవసాయ, విద్యుత్, పంచాయితీరాజ్, రెవెన్యూ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి అధికారి గతంలో ఎలా ఉన్నారో తెలియదు. ఈ ప్రభుత్వంలో మాత్రం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఆర్‌బికే సిబ్బంది సమావేశంకు హాజరు కాకపోవడంతో వారికి షోకాస్ నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఓ భానుప్రసాద్‌కు సూచించారు. రెవెన్యూలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిపై భాద్యతగా వ్యవహరించాలన్నారు. మండలంలో పశుమేత భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసులు, డిటి శ్రీనివాసరావు, ఎస్ఐ చంద్రశేఖర్, ఆర్ఐ, నాగరాజు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వార్త

రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

| అన్నమయ్య జిల్లా | కడప జిల్లా |
| --- | --- |
| రాయచోటి కలెక్టరేట్, రాయచోటి అర్బన్, రాయచోటి క్రైం, గుర్రంకొండ, కలకడ, పెద్దమండెం, సుండుపల్లె, మంగంపేట, వాయల్పాడు, పెద్దతిప్పసముద్రం | కడప కలెక్టరేట్, కడప అర్బన్, వల్లూరు, చెన్నూరు, కాశినాయన, జమ్మలమడుగు అర్బన్, మైలవరం, యర్రగుంట్ల |

మీ పూర్తి బయోడేటాతో 12వ తేది శుక్రవారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086